సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో 22.719 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 22.719 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 428 క్యూసెక్కుల వంతున వరద కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,150
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,510
3శాతం జీఎస్టీతో	రూ.5,675
నవర (8గ్రా)	రూ.45,400

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.8 /29.0

బుధవారం గాలిలో తేమ 51 శాతం ఉంది. గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తాయని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ విజేత లీనాడయానా



ప్రథమ స్థానంలో నిలిచిన లీనా డయానా

నెల్లూరు (టౌన్): వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా సైన్స్ కేంద్రంలో 'మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్ ఆర్ ఏ డైట్ ఫుడ్' అనే అంశంపై జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌ను బుధవారం నిర్వహించారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన 8,9,10 తరగతుల విద్యార్థులు 41 మంది సెమినార్‌లో పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో బుచ్చిరెడ్డిపాళెం డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని కే లీనాడయానా జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 25న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. నెల్లూరు విశ్వసాయి ఎస్ఆర్‌కే, ఓవెల్ స్కూల్ విద్యార్థినులు పీ శృతి, జీ ఝాన్సీకార్తీక ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని వివరించారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత నెల్లూరు




విజేతగా నిలిచిన నెల్లూరు జట్టు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్‌కాంప్లెక్స్‌లో బుధవారం నిర్వహించిన ఏపీ స్టేట్ సింహపురి జోన్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు విజేతగా నిలవగా, అన్నమయ్య జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్రాధ్యక్షుడు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడాదుస్తులను అందజేశారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ ఉమాశంకర్, జాయింట్ సెక్రటరీలు అనిల్, నాని, సీనియర్ క్రీడాకారులు చిట్టిబాబు, బాలా, మలిశెట్టి సనత్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నోవ్ సోర్స్ కంపెనీలో ఉద్యోగాలకు 52 మంది హాజరవగా, 23 మంది ఎంపికయ్యారు. వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలోని ఉద్యోగాలకు 29 మంది హాజరవగా, 11 మంది, వరుణ్ మోటార్స్‌లోని ఉద్యోగాలకు 47 మంది హాజరవగా, 18 మందిని ఎంపిక చేశారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.35 కోట్లు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,35,70,612 వచ్చినట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. బుధవారం ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా 77 గ్రాముల బంగారం, 435.650 కేజీల వెండి, 213 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పర్యవేక్షించారు.

తిరుమలకు నిమిషానికి రెండు బస్సులు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శుక్రవారం జరిగే గరుడోత్సవానికి తిరుపతి నుంచి తిరుమలకు ప్రతి నిమిషానికి రెండు బస్సులు చొప్పున నడుపుతామని డీపీటీఓ బుధవారం తెలిపారు. సాధారణ రోజుల్లో నిమిషానికి ఒక్క సర్వీస్ చొప్పున రోజుకు 3,930 ట్రిప్పులు నడుపుతుండగా, గరుడోత్సవం రోజున నిమిషానికి రెండు సర్వీసుల చొప్పున 5,456 ట్రిప్పులు తిప్పడానికి రంగం సిద్ధం చేశామని వెల్లడించారు.

బైబై గణేశా

నిమజ్జన ఘాట్ వద్ద గణపతికి నమస్కరిస్తున్న భక్తులు



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వీధి వీధిన కొలువైన గణనాథులు బుధవారం గంగమ్మ ఒడికి చేరారు. జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తప్పెట్లు, మేళతాళాల నడుమ గణపతి బొమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



గణనాథునికి వీడ్కోలు పలుకుతున్న భక్తులు



స్వర్ణాల చెరువులో గణనాథుడి విగ్రహాల నిమజ్జనం



నెల్లూరు స్వర్ణాల చెరువులో నిమజ్జనానికి గణేశ్ విగ్రహాన్ని క్రేన్ సాయంతో దించుతున్న దృశ్యం

రాళ్లపాడుకు వెలిగొండ జలాలు

కందుకూరు నియోజకవర్గానికి జీవనాడి అయిన వర్షాధారిత రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు శాశ్వత నీటి వనరుల కేటాయింపు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. సాగు, తాగునీటి అవసరాలకు పూర్తిస్థాయిలో నీటిని అందించడమే లక్ష్యంగా వెలిగొండ ప్రాజెక్ట్ నుంచి 1.1 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటికే సోమశిల ప్రాజెక్ట్ నుంచి వస్తున్న 1.5 టీఎంసీలకు ఈ కేటాయింపులు అదనం. వెలిగొండ తూర్పు కాలువ నుంచి రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు నీటిని మళ్లించే పనులు త్వరలోనే ప్రారంభంకానున్నాయి. ఈ పనులు పూర్తయితే భవిష్యత్‌లో రాళ్లపాడు ప్రాజెక్ట్ ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- వెలిగొండ తూర్పు కాలువ నుంచి 1.1 టీఎంసీలు కేటాయింపు
- రూ.6.14 కోట్లతో 8 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం
- అక్కడ్నుంచి గ్రావిటీ ద్వారా నీరు తరలింపు
- ఇప్పటికే సర్వే పనులు ప్రారంభించిన కాంట్రాక్ట్ సంస్థ
- త్వరలోనే కాలువ నిర్మాణాన్ని పూర్తి చేస్తామంటున్న రాళ్లపాడు ప్రాజెక్ట్ అధికారులు



కందుకూరు: ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు, వైఎస్సార్ జిల్లాలకు సాగు, తాగునీటిని అందించే లక్ష్యంతో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు తూర్పు కాలువ జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు ఎగువన దాదాపు 50 కిలోమీటర్ల దూరంలోనే వెళ్తుంది. ఈ కాలువ నుంచి రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు నీటిని మళ్లిస్తే ఉపయోగం ఉంటుందని భావించిన కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి అధికారులతో కలిసి ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కాలువ నుంచి 1.1 టీఎంసీలు తీసుకునేలా అనుమతులు సాధించారు. అయితే వెలిగొండ తూర్పుకాలువ నుంచి రాళ్లపాడు ప్రాజెక్ట్ వరకు దాదాపు 50 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ మధ్యలో కేవలం 8 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం చేపడితే సరిపోతుంది. అక్కడి నుంచి ఉప్పుటేరు గ్రావిటీ ద్వారా నేరుగా రాళ్లపాడు ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది. ప్రస్తుతం కాలువ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ. 6.14 కోట్లు కేటాయించి టెండర్ ప్రక్రియను పూర్తి చేసింది. ఈ మేరకు పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ సర్వే పనులు చేపడుతోంది. త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసి కాలువ నిర్మాణం చేపట్టనుంది. ఈ మేరకు రాళ్లపాడు ప్రాజెక్ట్ అధికారులు కూడా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు.

తీరనున్న సాగు, తాగునీటి కష్టాలు

రాళ్లపాడు ప్రాజెక్ట్ ప్రధానంగా వర్షాధార ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 1.1 టీఎంసీలు. క్రమేణా ఆయకట్టు పెరుగుతూ అధికారిక, అనధికారికంగా కలుపుకుని 25 వేల ఎకరాలకు చేరింది. అలాగే నియోజకవర్గంలోని వలేటివారిపాళెం, లింగసముద్రం, గుడ్లూరు మండలాల్లోని 110 గ్రామాలకు తాగునీటిని అందించే భారీ మంచినీటి పథకాలు ఈ ప్రాజెక్ట్ నుంచే ఉన్నాయి. దీంతో ప్రాజెక్ట్ సామర్థ్యం మేరకు నీరు ఎటూ సరిపోని పరిస్థితి. ఇక వర్షాలు పడకపోతే అటు సాగు, ఇటు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అప్పట్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సోమశిల ప్రాజెక్ట్ ఉత్తర కాలువ నుంచి 1.5 టీఎంసీలను రాళ్లపాడుకు కేటాయించారు. ప్రస్తుతం సోమశిల ప్రాజెక్ట్ నుంచి రాళ్లపాడుకు ఆ నీరు క్రమం తప్పకుండా వస్తున్నాయి. అయితే ప్రాజెక్ట్ నీటి వనరులను మరింత పెంచాలనే లక్ష్యంతో వెలిగొండ ప్రాజెక్ట్ నుంచి 1.1 టీఎంసీలను ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి సూచనల మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పనులు కూడా పూర్తయితే రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు నీటి సమస్య పూర్తిగా తీరుతుంది. అటు పూర్తి స్థాయిలో పంటలు, ఇటు తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటిని అందించవచ్చు. ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరాలకు అనుగుణంగా దశల వారీగా అటు సోమశిల నుంచి ఇటు వెలిగొండ నుంచి నీటిని తీసుకునే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

> **త్వరలోనే పనులు ప్రారంభిస్తాం**
>
> వెలిగొండ తూర్పు కాలువ నుంచి రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు 1.1 టీఎంసీలు మళ్లించేందుకు ప్రణాళికలు రూపొందించాం. తూర్పుకాలువ నుంచి 7 నుంచి 8 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం చేపడితే సరిపోతుంది. అక్కడ్నుంచి గ్రావిటీ ద్వారా రాళ్లపాడు ప్రాజెక్ట్‌లోకి నీరు చేరుతుంది. ఇప్పటికే కాలువ నిర్మాణానికి రూ 6.14 కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే కాలువ నిర్మాణ పనులను ప్రారంభిస్తాం. – లక్ష్మీనారాయణ, డీఈ, రాళ్లపాడు ప్రాజెక్ట్



రాళ్లపాడు ప్రాజెక్ట్ (ఫైల్)

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా చర్యలు

- ఎస్పీ కే తిరుమలేశ్వరరరెడ్డి



ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): గణేశ్ నిమజ్జన కార్యక్రమాలకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరు నగరంలోని ఇరుకళలపరమేశ్వరి దేవస్థానం వద్ద గల గణేశ్ ఘాట్, పెన్నానదితో పాటు జిల్లాలోని అన్ని నిమజ్జన ప్రదేశాల్లో మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారుల సమన్వయంతో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశామన్నారు. వినాయక ప్రతిమల ఊరేగింపు మొదలు నిమజ్జనం పూర్తయ్యేవరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో లైఫ్ జాకెట్లు, నాటుపడవలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీలు సహకరించాలని కోరారు. నిర్దేశిత సమయాల్లో, నిర్దేశిత ప్రదేశాల్లో నిమజ్జనాలు పూర్తిచేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం

- జేసీ కూర్మనాథ్



మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

ఇందుకూరుపేట: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని జేసీ కూర్మనాథ్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటున్నందున ప్రజలు తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోవాలని కోరారు. కాగా జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 25 అర్జీలు అందాయని జేసీ తెలిపారు. సివిల్‌సప్లయీస్, పంచాయతీరాజ్, భూములకు సంబంధించి వినతులు అందగా, అధిక భాగం అక్కడికక్కడే పరిష్కరించామని వివరించారు. ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఇందుకూరుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు ఆర్డీఓ మలోల, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, డ్వామా పీడీ వెంకటరావు, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ కే నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో నకిలీ రైల్వే డీఎస్పీ అరెస్ట్

గూడూరు రూరల్: గూడూరు పట్టణ, పరిసర ప్రాంతాల్లో తాను సదరన్ రైల్వేలో డీఎస్పీ అంటూ కొద్ది రోజులుగా హల్‌చల్ చేస్తున్న వ్యక్తిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. గూడూరు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి నిందితుడి వివరాలను వెల్లడించారు. వివరాలు..ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఇనమనమెల్లూరు గ్రామానికి చెందిన మందా నాగరాజు ఆరు నెలలుగా గూడూరు ప్రాంతంలో నివాసం ఉంటూ తాను సదరన్ రైల్వేలో డీఎస్పీ అని నమ్మబలికాడు. ఈ క్రమంలోనే ఓ సెటిల్‌మెంట్‌కు సంబంధించి కొండంరెడ్డి రమేష్‌రెడ్డి అలియాస్ రాజారెడ్డిని కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లి బాండ్ పేపర్‌పై బలవంతంగా సంతకాలు పెట్టించాడు. పది రోజుల్లో రూ.10 లక్షలు ఇవ్వకపోతే ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి నాగరాజును విచారించగా నకిలీ డీఎస్పీ అని తేలింది. ఈ మేరకు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో గూడూరు సొసైటీ ప్రాంతానికి చెందిన రమేష్ అనే వ్యక్తికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1.5 లక్షలు వసూలు చేసినట్లు తేలింది. నిందితుడు నాగరాజు రైల్వేలో లోకోపైలట్, ఆర్‌పీఎఫ్ డీఎస్పీ అని చెప్పుకుంటూ గూడూరు పట్టణ, పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు వలవేశాడు. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో టీసీ, క్లర్క్ వంటి ఉద్యోగాలు ఇప్పిస్తానని మభ్యపెట్టి వారి నుంచి సుమారు రూ.30 లక్షల వరకు వసూలు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అతనిపై ఒంగోలు -1 టౌన్‌లో 2021లో చీటింగ్ కేసు నమోదై ఉందని చెప్పారు. నకిలీ రైల్వే డీఎస్పీ నుంచి నకిలీ యూనిఫామ్, ఐడీ కార్డులు, రైల్వే మెడికల్ ఫిట్‌నెస్, ఆర్ఆర్‌బీ సెలెక్షన్ సర్టిఫికెట్లు, రైల్వే పోలీసు క్యాప్‌తో పాటు వైర్‌సెల్ సెట్, ఫైబర్ లాఠీ, ఐదు సెల్‌ఫోన్లు, పల్సర్ బైక్, ల్యాప్‌టాప్, రూ.1.9లక్షల నగదుతో పాటు రూ.7 లక్షల విలువ చేసే రెండు ఖాళీ స్థలం డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ హాజరత్‌బాబు, ఆర్‌పీఎఫ్ సీఐ లక్ష్మణరావు, ఏఎస్ఐ సీకేఎన్ రావు, ఒకటో పట్టణ ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక

దక్కిలి: మండలంలోని నాయుడుపాళేనికి చెందిన 42 కుటుంబాల టీడీపీ మద్దతుదారులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా నేదురుమల్లి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కష్టపడి పనిచేస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో కోళ్లపూడి వెంకటేశ్వర్లు, హరి, శివకుమార్, శివశంకర్, ఎస్.మహేష్, డీ. సుబ్బారావు, వెంకటస్వామి, రమేష్, పెంచలరత్నం, సుబ్రహ్మణ్యం, బలరామయ్య, శ్రీనివాసులు, రాఘవయ్య ఉన్నారు.

జనవరిలో నూతన భవనాల ప్రారంభం



ఏరియా ఆస్పత్రిలో డాక్టర్లు తదితరులతో ఎమ్మెల్యే రామిరెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులతో కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి నూతన భవనాలను నిర్మిస్తోందని, పనులు త్వరగా పూర్తి చేసి వచ్చే జనవరిలో ప్రారంభించేలా చర్యలు తీసుకున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న భవనాలను, ఇతర పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఇంజినీర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారికి సూచనలిచ్చారు. అనంతరం వైద్య పరీక్షలు చేసే గదులు తదితర వాటిని చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ప్రాంగణంలో రోడ్లు, పార్కింగ్, మొక్కలు నాటడం వంటి పనులు సత్వరమే చేయనున్నట్లు వెల్లడించారు. 65 ఏళ్ల క్రితం అప్పటి జనాభాను దృష్టిలో పెట్టుకుని, తక్కువ విస్తీర్ణంలో నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రస్తుత జనాభాకు సరిపోవడం లేదన్నారు. అందుకే పట్టణానికి దగ్గరలో ఐదెకరాల విస్తీర్ణంలో నూతన ప్రభుత్వాస్పత్రిని నిర్మించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరగా వెంటనే ఆమోదించి చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించారన్నారు. కలెక్టర్ శ్రద్ధ తీసుకుని భూమిని గుర్తించి వైద్యశాఖకు అప్పగించడానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యే వెంట విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ కామంచి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, కలికి శ్రీహరిరెడ్డి, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, చెన్ను ప్రసాద్‌రెడ్డి, డేగా రాము, షేక్ నాయబ్ రసూల్, తిరువీధి ప్రసాద్ తదితరులున్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. దుత్తలూరులోని క్యాంప్ కార్యాలయంలో ఎనిమిది మండలాల అధ్యక్షులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు సంక్షేమ పాలన అందుతోందన్నారు. పథకాలు, అభివృద్ధిపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేయాలన్నారు. అధ్యక్షులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. ప్రజా సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మేకపాటిని సత్కరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జనార్దనరెడ్డి, రవీంద్ర, శ్రీనివాసులురెడ్డి, రవీంద్రారెడ్డి, బాలగురవారెడ్డి, సీఎం ఓబుల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాయకులు గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న మండల కన్వీనర్లు

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

- కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: 'ధరల స్థిరీకరణ నిధి సమావేశాలను ప్రభుత్వం ప్రతి నెలా నిర్వహిస్తోంది. రైతులు నష్టపోకుండా వారి ఆదాయం పెంచడమే వీటి ప్రధాన లక్ష్యం.' అని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం జరిగిన ధరల స్థిరీకరణ నిధి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. పెట్టుబడి సాయం చేస్తున్నారన్నారు. అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. భవిష్యత్‌లో రైతులకి సంబంధించి సంపూర్ణ సమాచారం ముందుగా అందించే విధానానికి ప్రభుత్వం త్వరలోనే శ్రీకారం చుట్టనుందన్నారు. దేశంలో ఆయా సీజన్‌లో ఏ పంటలకు డిమాండ్ ఉంది?, ఏ పంటను సాగు చేస్తే మేలు జరుగుతుందనే విషయాన్ని ముందుగానే తెలియజేస్తారన్నారు. ఉద్యాన శాఖ ద్వారా వివిధ రకాల పథకాల కింద రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. వేప నూనె వంటివి సబ్సిడీపై ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. స్థానిక ఏఎంసీలో మట్టి నమూనా పరీక్ష కేంద్రం ఏర్పాటు గురించి, 119 రకం శనగ విత్తనాలు, 1694 రకం వేరుశనగ విత్తనాలు రైతులకు సరఫరా చేసేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తానన్నారు. పలు కారణాలతో ఈ ఏడాది వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం తగ్గినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ ఏడీఏ అనసూయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

24న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు ఈనెల 24వ తేదీన కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సురేష్, సెక్రటరీ టి.సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వయసు పరిమితి లేదన్నారు. ఎంపికైన వారు ఈనెల 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలియజేశారు. ఎంపికలకు వచ్చే వారు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 98661 25955, 98494 29859 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

శ్రీవారి గొడుగుల ఊరేగింపు

పిచ్చాటూరు: పిచ్చాటూరులో బుధవారం సాయంత్రం శ్రీవారి గొడుగులను ఊరేగించారు. చెన్నైలోని శ్రీమద్ రామానుజాచార్యుల నిత్య కైంకర్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా తిరుమల శ్రీవారి గరుడసేవకు గొడుగులు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా పిచ్చాటూరు శ్రీమలయపెరుమాల్ ఆలయానికి గొడుగులు చేరుకున్నాయి. స్థానిక సర్పంచ్ కేజీ.రోస్ రెడ్డి సమక్షంలో ఆలయానికి వాటిని సమర్పించారు. అక్కడి నుంచి శ్రీవారి గొడుగులు ఊరేగింపుగా బజారు వీధి, టూటౌన్ మీదుగా ఊరి చివర ఉన్న సాయిబాబా మందిరం వద్దకు చేరుకున్నాయి. ఊరేగింపులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని భక్తులు దర్శించుని మొక్కులు తీర్చుకున్నారు.



గొడుగును స్వీకరిస్తున్న సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి

వ్యక్తిని కాపాడిన మెరైన్ పోలీసులు

ఉలవపాడు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోయిన ఓ వ్యక్తిని మెరైన్ పోలీసులు కాపాడారు. ఈ ఘటన మండల పరిధిలోని అలగాయపాళెం సముద్ర తీరం వద్ద బుధవారం జరిగింది. ఏఎస్సై వెంకటేశ్వర్లు కథనం మేరకు.. మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన చంద్రగిరి రాఘవ అనే వ్యక్తి వినాయకుడి విగ్రహం నిమజ్జనం కోసం వచ్చాడు. కార్యక్రమం పూర్తయ్యాక అందరూ వెళ్లిపోయారు. ఇతను మాత్రం అక్కడే ఉండి చీకటి పడిన తర్వాత సముద్రంలోకి వెళ్తుండడాన్ని మెరైన్ పోలీసులు గమనించారు. వెంటనే వెళ్లి అతడిని బయటకు తీసుకొచ్చారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోతుంటే కాపాడినట్లు ఏఎస్సై తెలిపారు. కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో రూ.లక్ష అపహరణ

నాయుడుపేట టౌన్: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం ఓ వ్యక్తి జేబులోంచి రూ.లక్ష నగదు అపహరణకు గురైంది. ఈ విషయమై బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతిలోని ఓ త్రీస్టార్ హోటల్‌లో పనిచేస్తున్న కిరణ్ తిరుపతి నుంచి నెల్లూరుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. అతని ప్యాంట్ జేబులో రూ.లక్ష నగదు పెట్టుకుని వెళ్తున్నాడు. బస్సు నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఆపడంతో కిరణ్ సిగరెట్ తాగేందుకు కిందకు దిగాడు. తిరిగి బస్సు ఎక్కుతుండగా ఇద్దరు వ్యక్తులు అతడ్ని తోసుకుంటూ బస్సు ఎక్కారు. ఆపై గూడూరు సమీపం వరకు వెళ్లేసరికి జేబులో ఉన్న నగదు కనిపించలేదు. గుర్తుతెలియని ఆ ఇద్దరు వ్యక్తులు నాయుడుపేటలోనే దిగేసినట్లు గుర్తించి బాధితుడు లబోదిబోమన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనంతసాగరం తహసీల్దార్‌గా సుభాషిణి



సుభాషిణి

నెల్లూరు (దర్గామిట్ట): అనంతసాగరం మండల తహసీల్దార్‌గా వై.సుభాషిణిని నియమిస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె రాపూరు డీటీగా ఉండేవారు. అక్కడి తహసీల్దార్ సెలవులో ఉండడంతో ఆ బాధ్యతలు చూస్తున్నారు. తాజాగా అనంతసాగరం మండలానికి బదిలీ చేశారు.

బయో టెక్నాలజీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

వెంకటాచలం: మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగంలో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బయో టెక్నాలజీ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం ఆ విభాగాధిపతి డాక్టర్ ఉదయ్‌శంకర్ ఫోన్ నంబర్ 81878 14140ను సంప్రదించాలని తెలియజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 113
బ్రాయిలర్ చికెన్	: 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 192



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.10

మొక్కు తీర్చుకుని వస్తూ మృత్యు ఒడికి..

- మోటార్ బైక్‌ను ఢీకొన్న కారు
- యువకుడి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు





ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సురేంద్ర, కారు డ్రైవర్ జిలానీ

సంగం: బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కు తీర్చుకుని ఇంటికెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పెరమన వద్ద నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. అనంతసాగరం మండలం రేవూరు గ్రామానికి చెందిన నాగెళ్ల వీరయ్య, లక్ష్మి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు నాగేంద్ర (20) డెకరేషన్ పనులు చేస్తుంటాడు. జొన్నవాడలో మొక్కు తీర్చుకునేందుకు మంగళవారం రాత్రి తన స్నేహితుడు సురేంద్రతో కలిసి మోటార్ బైక్‌పై వెళ్లాడు. దైవ దర్శనం అనంతరం అక్కడే నిద్రించి బుధవారం ఉదయం ఇద్దరూ స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో పెరమన వద్ద ఆత్మకూరు వైపు నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న నాగేంద్ర అక్కడికక్కడే మృతిచెందగా సురేంద్ర, కారు నడుపుతున్న ఏఎస్‌పేటకు చెందిన డ్రైవర్ మహ్మద్ జిలానీ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సంగం ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని నాగేంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం తరలించారు. క్షతగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబాన్ని చూసుకుంటున్న నాగేంద్ర మృతితో విషాదం నెలకొంది.



నాగేంద్ర (ఫైల్)

నాటు సారా స్వాధీనం

పొదలకూరు: మండలంలోని బిరదవోలు అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీపై ఎస్ఈబీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. పొదలకూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు కథనం మేరకు.. నెల్లూరు సెబ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ ప్రాంతంలో నెల్లూరు సెబ్ పోలీస్ టీమ్‌తో కలిసి దాడులు నిర్వహించగా నాటు సారా, 100 లీటర్ల బెల్లపు ఊట, గ్యాస్ సిలిండర్, స్టౌ, వాటర్‌పైపు, స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సారా కాసిన బడుగు రమేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ దాడుల్లో సెబ్ పోలీస్ టీమ్ ఎస్సై బాలకృష్ణ, సెబ్ ఎస్సై సీహెచ్ శ్రీనివాసులు, హెచ్‌సీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నాటు సారా



పతాకధారులుగా హర్మన్‌ప్రీత్ సింగ్, లవ్లీనా

ఆసియా క్రీడల ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్ వ్యవహరించనున్నారు. ఈనెల 23న చైనాలోని హాంగ్జూ నగరంలో ఆసియా క్రీడలకు తెర లేవనుంది. అస్సాంకు చెందిన 25 ఏళ్ల లవ్లీనా టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం, ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. పంజాబ్‌కు చెందిన హర్మన్ భారత్ తరఫున 191 మ్యాచ్‌లు ఆడి 155 గోల్స్ చేశాడు.

రష్మిక శుభారంభం



అంతర్జాతీయ మహిళల టెన్నిస్ (ఐటీఎఫ్) టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. సింగిల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన ఆమె, డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పెర్త్‌లో జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-3, 6-3తో జెస్సీ కులే (ఆస్ట్రేలియా)పై గెలిచింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక (భారత్)-మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6-4, 7-6 (7/5)తో ఎలీనా మిసిచ్ (ఆస్ట్రేలియా)-మిచికా ఒజెకి (జపాన్) జంటను ఓడించింది.

భారత్ సంచలనం

వాలీబాల్‌లో కొరియాపై విజయం ● ఆసియా క్రీడల్లో నాకౌట్ దశకు అర్హత



హాంగ్జూ (చైనా): మూడున్నర దశాబ్దాల పతక నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల వాలీబాల్ జట్టు తొలి అడ్డంకిని అధిగమించింది. గ్రూప్ 'సి'లో టాప్ ర్యాంక్‌లో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. మంగళవారం కంబోడియా జట్టును ఓడించిన భారత జట్టు బుధవారం పెను సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉన్న దక్షిణ కొరియా జట్టును భారత్ బోల్తా కొట్టించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత జట్టు 25-27, 29-27, 25-22, 20-25, 17-15తో దక్షిణ కొరియాపై గెలిచింది. 1966 నుంచి ప్రతి ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా స్వర్ణ, రజత, కాంస్య పతకాల్లో ఏదో ఒక పతకం సాధిస్తూ వస్తోంది. భారత జట్టు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచింది. కొరియాతో 2 గంటల 38 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు సమష్టి ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా అమిత్ అత్యధికంగా 24 పాయింట్లు స్కోరు చేశాడు. వినిత్ కుమార్, అశ్వల్ రాయ్ 19 పాయింట్ల చొప్పున సాధించారు. మనోజ్ ఎనిమిది పాయింట్లు, ఎరిన్ వర్గీస్ ఏడు పాయింట్లు అందించారు. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో కొరియా రజత పతకం నెగ్గగా, భారత్ 12వ స్థానంలో నిలిచింది.

రోయింగ్‌లో జోరు...

రోయింగ్‌లో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్ కుమార్, ఆశిష్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాక్స్‌లెస్ ఫోర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరింది. మహిళల కాక్స్‌డ్ ఎయిట్ ఈవెంట్‌లో అశ్వతి, మృణమయి సాల్గావ్‌కర్, ప్రియా దేవి, రుక్మిణి, సోనాలీ, రీతూ, వర్ష, తెన్‌దోన్‌తోయ్ సింగ్, గీతాంజలిలతో కూడిన భారత జట్టు కూడా ఫైనల్లోకి ప్రవేశించింది.

నేడు మలేసియాతో భారత మహిళల పోరు



మహిళల టి20 క్రికెట్‌లో భారత నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. మలేసియాతో నేడు జరిగే పోరులో స్మృతి మంధాన బృందం బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరడంతో పాటు పతకం రేసులో నిలుస్తుంది. ఉదయం గం. 6:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

సిరాజ్ మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి భారత పేసర్

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 694 పాయింట్లతో నంబర్‌వన్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 9వ స్థానంలో ఉన్న ఈ హైదరాబాదీ ఏకంగా ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. వన్డే ర్యాంకింగ్స్‌లో సిరాజ్ టాప్‌గా నిలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో నంబర్‌వన్‌గా నిలిచిన అతను రెండు నెలల తర్వాత ఆసీస్ పేసర్ జోష్ హాజల్‌వుడ్‌కు ఆ స్థానాన్ని కోల్పోయాడు. ఆసియా కప్ ఫైనల్లో 21 పరుగులకే 6 వికెట్లు తీసిన ప్రదర్శనతో ఇప్పుడు మళ్లీ శిఖరానికి చేరాడు. కెరీర్‌లో అత్యుత్తమ దశను చూస్తున్న సిరాజ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ చేశాడు. కొంత కాలం క్రితం చనిపోయిన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ 'మిస్ యు పాపా' అంటూ క్యాప్షన్ పెట్టాడు. తనను తల్లిదండ్రులు ఆశీర్వదిస్తున్న ఫోటోను వారిద్దరు చూస్తున్న చిత్రానికి తాను గ్రౌండ్‌లో ఆడుతున్న ఫోటోను అతను జత చేశాడు.



అమెరికాలోని మూడు నగరాల్లో...

టి20 ప్రపంచకప్ వేదికలు ఖరారు



దుబాయ్: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌నకు సంబంధించి అమెరికాలోని మూడు వేదికల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. న్యూయార్క్, డాలస్, ఫ్లోరిడా నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరుగుతాయి. బ్రోవార్డ్ కౌంటీ (ఫ్లోరిడా), గ్రాండ్ ప్రయరీ (డాలస్), ఐసన్‌హోవర్ పార్క్ (న్యూయార్క్) స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తామని ఐసీసీ పేర్కొంది. టి20 ప్రపంచకప్ అమెరికాలో జరగడం ఇదే మొదటిసారి. 2024 టోర్నీని వెస్టిండీస్‌తో కలిసి యూఎస్‌ఏ సంయుక్తంగా నిర్వహించనుంది. ఈ టోర్నీలో మొదటిసారి 20 జట్లు పాల్గొనబోతున్నాయి. ఇటీవలి వరకు ఈ టోర్నీని అమెరికాలో నిర్వహించడంపై సందేహాలు ఉన్నా ఐసీసీ తాజా ప్రకటనతో సందిగ్ధత తొలగింది. వచ్చే ఏడాది జూన్ 4-జూన్ 30 మధ్య టోర్నీ జరిగే అవకాశాలు ఉన్నాయి.

'నా అకౌంట్‌లో 80 వేలే ఉన్నాయి'

భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఆవేదన



న్యూఢిల్లీ: అతను భారత నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు... ఏడాది మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఏటీపీ టోర్నీలలో పాల్గొంటున్నాడు. టోర్నీల్లో ప్రదర్శనకు ప్రైజ్‌మనీ కూడా దక్కుతుంది. మామూలుగా అయితే టెన్నిస్ ఆటగాళ్లు బాగా డబ్బున్నవాళ్లు అయి ఉంటారని, ఏ స్థాయిలో ఆడినా విలాసవంతమైన జీవితం ఉంటుందనిపిస్తుంది. కానీ ప్రపంచ టెన్నిస్‌లో వాస్తవ పరిస్థితి వేరు. అది ఎంత ఖరీదైందో... అగ్రశ్రేణి స్టార్లు తప్ప 100 కంటే ఎక్కువ ర్యాంక్ ఉన్న ఆటగాళ్ల స్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో చెప్పేందుకు ఇది చక్కటి ఉదాహరణ! భారత్‌కు చెందిన ప్రపంచ 159వ ర్యాంకర్ సుమీత్ నగాల్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన బ్యాంక్ అకౌంట్‌లో ఇప్పుడు 900 యూరోలు (సుమారు రూ. 80 వేలు) మాత్రమే ఉన్నాయని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ప్రైజ్‌మనీల ద్వారా వచ్చిన డబ్బు, ఐఓసీఎల్ కంపెనీ జీతం, మహా టెన్నిస్ ఫౌండేషన్ ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తం టెన్నిస్‌లోనే పెడుతున్నానని, అయినా సరే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని వెల్లడించాడు. డబ్బులు లేకపోవడంతో ఫిజియో కూడా లేకుండా ఒకే ఒక కోచ్‌తో తాను పోటీల్లో పాల్గొంటున్నానని అన్నాడు. టెన్నిస్ సర్క్యూట్‌లో నిలకడగా ఆడుతూ టాప్-100లో చేరాలంటే ఏడాదికి కనీసం రూ. 1 కోటి ఖర్చు అవుతుందని నగాల్ చెప్పాడు. 'కొన్నేళ్లుగా నిలకడగా ఆడుతూ భారత నంబర్‌వన్‌గా ఉన్నా నాకు కనీస మద్దతు కరువైంది. ప్రభుత్వం 'టాప్స్' పథకంలో నా పేరు చేర్చలేదు. డబ్బులు లేక జర్మనీలోనే టెన్నిస్ అకాడమీలో శిక్షణకు దూరమయ్యాను. నేను గాయపడి ఆటకు దూరమైనపుడు అసలు ఎవరూ నన్ను పట్టించుకోలేదు. రెండుసార్లు కోవిడ్ రావడంతో ర్యాంక్ పడిపోయింది. మన దేశంలో ఆర్థికంగా మద్దతు లభించడం చాలా కష్టం. నా వద్ద ఉన్న డబ్బంతా ఆటకే పెడుతున్నా. గత రెండేళ్లలో ఏమీ సంపాదించలేదు. నేనేమీ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉండటం లేదు. అన్నీ కనీస అవసరాలే. ఏం చేయాలో అర్థం కావడం లేదు. పూర్తిగా చేతులెత్తేశాను' అని నగాల్ తన బాధను చెప్పుకున్నాడు.

పతకానికి విజయం దూరంలో...

- సెమీస్‌లో పోరాడి ఓడిన అంతిమ్
- నేడు కాంస్య పతక బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- తొలి రౌండ్‌లో ప్రపంచ చాంపియన్‌పై నెగ్గిన భారత రెజ్లర్


అంతిమ్ పంఘాల్

బెల్‌గ్రేడ్ (సెర్బియా): భారత రెజ్లింగ్ రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ సీనియర్ స్థాయిలోనూ సత్తా చాటుకుంది. అండర్-20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండేళ్లు స్వర్ణ పతకాలు నెగ్గిన తొలి భారతీయ రెజ్లర్‌గా చరిత్ర సృష్టించిన అంతిమ్... ప్రస్తుతం ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక రేసులో నిలిచింది. సెమీఫైనల్లో అంతిమ్ 4-5 పాయింట్ల తేడాతో వనెసా కలాడ్‌జిన్‌స్కాయా (బెలారస్) చేతిలో పోరాడి ఓడిపోయింది. నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో అంతిమ్ గెలిస్తే పతకంతోపాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కూడా ఖరారవుతుంది. సోఫ్‌లీవిరా ఒర్‌షుష్ (హంగేరి), ఎమ్మా జోనా డెనిస్ మాల్మ్‌గ్రెన్ (స్వీడన్) మధ్య బౌట్ విజేతతో కాంస్య పతకం పోరులో అంతిమ్ తలపడుతుంది. అంతకుముందు తొలి రౌండ్‌లో అంతిమ్ 3-2తో డిఫెండింగ్ చాంపియన్ డొమినిక్ ఒలివియా పారిష్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అంతిమ్ 10-0తో రొక్సానా మార్టా జసినా (పోలాండ్)పై, క్వార్టర్ ఫైనల్లో 9-6తో నటాలియా మలిషెవా (రష్యా)పై గెలుపొందింది. భారత్‌కే చెందిన మనీషా (62 కేజీలు), ప్రియాంక (68 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో, జ్యోతి బెర్వాల్ (72 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) పతాకంపై, ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగా ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు.

సినిమా

మళ్లీ జోడీగా...


● సాయి పల్లవి, నాగచైతన్య

హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి మళ్లీ జోడీగా కనిపించనున్నారు. 'లవ్ స్టోరీ' (2021) వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత ఈ ఇద్దరూ 'ఎన్‌సీ 23'లో (వర్కింగ్ టైటిల్) మరోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు బుధవారం మేకర్స్ ప్రకటించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనున్న చిత్రమిది. నాగచైతన్య, చందు మొండేటి కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రం అవుతుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

తెలుగోడి జానపదం దమ్ము చూపించింది

- నిర్మాత 'బన్నీ' వాసు


● విద్య, శ్రీకాంత్, శివానీ, రాహుల్, 'బన్నీ' వాసు

''ఒక పాట హిట్ అయితే సక్సెస్ మీట్ చేయడం మాకు తెలిసి ఇదే తొలిసారి. మా 'కోట బొమ్మాళి పీఎస్' సినిమాలోని 'లింగి లింగి లింగిడి...' పాట తెలుగోడి జానపదం దమ్ము చూపించింది. ఈ పాటకి పి. రఘు సాహిత్యం అందించడంతో పాటు పాడారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, శ్రీకాంత్ మేక, వరలక్ష్మీ శరత్‌కుమార్ నటిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగి లింగిడి...' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేశారు. ఈ పాటకి అద్భుతమైన స్పందన వస్తోందంటూ సక్సెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ- ''చాలా కాలం తర్వాత మంచి సినిమా చేశాననే అనుభూతి ఉంది'' అన్నారు. ''నా జీవితంలో గుర్తుండిపోయే పాట వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు రాహుల్ విజయ్. ''ఈ పాట ఎంత పాపులర్ అయ్యిందో సినిమా కూడా అలాగే ఉంటుంది'' అన్నారు శివానీ రాజశేఖర్. ''నా సినిమాలో జానపదం పాట పెట్టాలనే కల ఈ చిత్రంతో నెరవేరింది'' అన్నారు తేజ మార్ని.

హిట్ అయినదే పెద్ద సినిమా

- శ్రీకాంత్


● 'రుద్రం కోట' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఓ దృశ్యం

''రుద్రం కోట' చిత్రం ట్రైలర్, పాటలు బాగున్నాయి. ఇప్పుడు ఏది హిట్ అయితే అదే పెద్ద సినిమా అవుతోంది. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించి, కొత్తవారిని ప్రోత్సహించాలి'' అన్నారు నటుడు శ్రీకాంత్. రుద్ర హీరోగా, శక్తి, విభీష హీరోయిన్లుగా రాము కోన దర్శకత్వం వహించిన చిత్రం 'రుద్రం కోట'. నటి జయలలిత కీలక పాత్రలో నటించి, సమర్పించారు. అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శ్రీకాంత్, నటి రాశీ విడుదల చేశారు. రాశీ మాట్లాడుతూ- ''రుద్రం కోట' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాను సపోర్ట్ చేస్తున్నవారికి కృతజ్ఞతలు'' అన్నారు జయలలిత. ''ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద సినిమాగా చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు అనిల్ ఆర్కా.

నాగేశ్వరరావుగారు నట విశ్వవిద్యాలయం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


● విగ్రహావిష్కరణ చేస్తున్న వెంకయ్య నాయుడుతో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అక్కినేని వెంకట్, నాగార్జున

''తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏయన్నార్ రెండు కళ్లు అని ఎప్పుడూ చెబుతుంటాను. తన జీవితాన్ని ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకోవడం నాగేశ్వరరావుగారిలోని గొప్పతనం. అమరశిల్పి జక్కన్న, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, మహా కవి కాళిదాసు.. ఇలా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఎలాంటి సినిమాలో అయినా ఒదిగిపోయేవారు. నాగేశ్వరరావుగారు ఒక పెద్ద నటనా విశ్వవిద్యాలయం. ఈ రోజు పరిశ్రమలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ విశ్వ విద్యాలయంలో విద్యార్థిననుకుని, ఆ గుణగణాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌కు మంచి ప్రణాళికలు వేసుకున్నట్లవుతుంది'' అన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. బుధవారం (సెప్టెంబరు 20) ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, మాట్లాడుతూ- ''నాగేశ్వరరావుగారు మహానటులు.. మహా మనిషి. సినిమా రంగంలో విలువలు పాటించిన వ్యక్తి నాగేశ్వరరావుగారు. అవతలివాళ్లు నేర్చుకోదగ్గ కొన్ని మంచి సంప్రదాయాలు, విలువల్లో ఆయన జీవించి, నటించి మనకు చూపించారు. ఆ మార్గంలో ప్రయాణిస్తే అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. నాగేశ్వరరావుగారు పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి, జీవిత చరమాంకంలోనూ నటిస్తూనే ఉన్నారు. కొంతమంది జీవిత కాలంలో జీవిస్తారు. జీవిత కాలం పూర్తయిన తర్వాత కూడా జీవించే మహానుభావులు కొందరు. వారిలో అక్కినేని నాగేశ్వరరావుగారు అగ్రగణ్యులు. ఆయన మంచి నటులే కాదు.. పరిణతి చెందిన గొప్ప ఆశావాది కూడా. ఆయన నాస్తికుడు. గొప్ప తాత్త్వికుడు. ఆయన పెద్దగా చదువుకోలేదని అంటారు. కానీ జీవితాలను చదివారు. జీవితంలో ఆయన పోరాటం చేశారు.. జీవితాన్ని ప్రేమించారు.. ఆస్వాదించారు. జీవితంలో నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టి చూపించారు'' అని అన్నారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ- ''1950 సమయంలో నాగేశ్వరరావుగారు సినిమాల్లో నటించడం ప్రారంభించాక, సొంతిల్లు కట్టుకోవడానికి ముందే మద్రాస్ విశ్వ విద్యాలయానికి పాతికవేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పాతిక వేలు ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి కూడా పాతిక వేలు విరాళం ఇచ్చారు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. 1959లో లక్ష రూపాయల విరాళం ఇచ్చి గుడివాడ కళాశాలను నిలబెట్టారు. నాలాంటివారు ఎందరో చదువుకోగలిగారు. ఆ విధంగా ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఓ విప్లవానికి ఆయన నాంది పలికారు'' అన్నారు.

డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ - ''అక్కినేని నాగేశ్వరరావుగారి కష్టం, కళల పట్ల ఆయనకు ఉన్న ప్రేమ ఆయన్ను ఓ లెజెండ్‌ని చేశాయి. యువ నటీనటులకు నాగార్జునగారు స్ఫూర్తి అని నా ఫ్రెండ్స్ సర్కిల్స్‌లో చెబుతుంటారు. నాగార్జునగారేమో తన తండ్రి చూపించిన మార్గంలో నడిచానని చెబుతుంటారు'' అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ- ''ఎవరి విగ్రహాన్ని అయినా చూస్తే.. ఆయన ఓ మహానుభావుడు... ఆయన మనతో లేరనే భావన నా మనసులో చిన్నతనం నుంచే ముద్రపడింది. ఏ విగ్రహం చూసినా నాకు అదే అనిపించేది. అందుకే వెంకయ్యనాయుడుగారు ఆవిష్కరించేంతవరకూ నేను నాన్నగారి విగ్రహాన్ని చూడలేదు. చూడబుద్ధి కాలేదు. ఎందుకంటే నాన్నగారు మాతో లేరనే విషయాన్ని అంగీకరించాల్సి వస్తుందేమోనని... శిల్పి వినీత్ ఈ విగ్రహాన్ని అద్భుతంగా చెక్కాడు. నాన్నగారు అద్భుతమైన జీవితాన్ని జీవించారు. తరతరాలుగా గుర్తుపెట్టుకునే పాత్రలు చేసిన నటుడు. కోట్లమంది తెలుగు ప్రజలు, అభిమానులు ప్రేమించిన వ్యక్తి.. ఇలా వివిధ రకాలుగా నాన్నగారు అందరికీ తెలుసు. మాకు మాత్రం నాన్నగారు మా గుండెలను ప్రేమతో నింపిన వ్యక్తి. నన్ను, నా తోబుట్టువులను, మా పిల్లలను.. అందర్నీ చల్లగా చూసిన వ్యక్తి. మాకు మనసు బాగున్నా, బాగోలేకున్నా నాన్నగారి దగ్గరికి వెళ్లి కూర్చుంటే చాలు అన్నీ సర్దుకునేవి. అన్నపూర్ణ స్టూడియోస్ నాన్నగారికి నచ్చిన స్థలం. నచ్చిన చోట విగ్రహం పెడితే ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లు అంటారు. సో.. ఆయన ప్రాణంతో మా దగ్గరే ఉన్నారని, ప్రాణంతో మా మధ్యనే నడుస్తున్నారని అనుకుంటున్నాము. నా ఆలోచనల్లోనే కాదు.. ప్రతి ఒక్కరి ఆలోచనల్లో నాన్నగారు ఎప్పటికీ జీవించే ఉంటారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన వారికి, ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వచ్చిన నాన్నగారి అభిమానులకు ధన్యవాదాలు'' అన్నారు.


● అఖిల్ ● నాగచైతన్య

నాగచైతన్య మాట్లాడుతూ- ''ఏయన్నార్‌గారంటే తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ పెద్ద, ఓ గొప్ప నటుడు. క్లాసిక్ ఐకాన్‌గా పరిచయం. ఆయన చిత్రాలు, ఆయన చేసిన ప్రయోగాలు ప్రేరణ కలిగించే కేస్ స్టడీగా చాలా మంది ఫిల్మ్ స్కూల్స్‌లో చదువుతుంటారు. ఈ జాబితాలో నేనూ ఉన్నాను. తాతగారితో నేను కలిసి నటించడం నా అదృష్టం. మన పుట్టుక మన చేతిలో ఉండదు. అలాంటిది అక్కినేని నాగేశ్వరరావుగారి మనవడిగా పుట్టడం నా అదృష్టం'' అని అన్నారు.

తాత ఏయన్నార్‌కు అఖిల్ నివాళులర్పించారు.

ఏయన్నార్ పెద్ద కుమారుడు వెంకట్ అక్కినేని మాట్లాడుతూ- ''మనిషి ఎంత కీర్తి సంపాదించినా, ఎంత ధనం గడించినా తలగడ మీద తల పెట్టగానే నిద్రపోవడం అనే ఆస్తి, సౌకర్యం ఏ ధనం ఇవ్వలేదు. ఏయన్నార్‌గారు తలగడ మీద తల పెట్టగానే హాయిగా నిద్రపోయేవారు. 1974లో బైపాస్ సర్జరీ జరిగింది. సర్జరీ ముందు రోజు నర్సు నిద్రకోసం మాత్ర ఇస్తే తీసుకోలేదు. ఏ మాత్ర వేసుకోకుండానే హాయిగా నిద్రపోయారు. ఆ తర్వాత ఆయన జీవితం అందరికీ తెలిసిందే. నాకు మరుజన్మ అంటూ ఉంటే ఆయన సన్నిధిలోనే ఉండాలనుకుంటున్నాను. అన్నపూర్ణ సంస్థ, ఏయన్నార్ ఫిల్మ్ స్కూల్, కాలేజీ, ఆయన చిత్రాలు, ఫ్యాన్స్ తీపి గుర్తులు'' అన్నారు.

మోహన్‌బాబు మాట్లాడుతూ- ''నాగేశ్వరరావుగారు ఒక గ్రంథం. ఆయన 'మరపురాని మనుషులు' సినిమాకు అసోసియేట్‌గా చేశాను. అన్నపూర్ణ సంస్థలో ఎన్నో సినిమాల్లో నటించాను'' అన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ- ''రైతు కుటుంబంలో పుట్టి అద్భుతమైన స్థితికి చేరుకున్న వ్యక్తి నాగేశ్వరరావుగారు. మహానట వృక్షం. కళాకారులకు గొప్ప వరం. స్వయంశిల్పి. స్నేహశీలి. అద్భుతమైన క్రమశిక్షణ కలిగిన వ్యక్తి'' అన్నారు.

ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ- ''ఓ వేడుకలో నాగేశ్వరరావుగారితో మాట్లాడే అవకాశం లభించింది. స్టార్ అయిన మీరు 'మిస్సమ్మ' సినిమాలో కమెడియన్‌గా ఎందుకు చేశారు? అని ఆయన్ను అడిగాను. 'దేవదాసు' తర్వాత అన్నీ తాగుబోతు పాత్రలే వస్తున్నాయని, ఇమేజ్ మార్చుకోకపోతే ఇబ్బందవుతుందేమోనని, ఆ పాత్రను తానే అడిగి మరీ చేశానని చెప్పారు. నాగేశ్వరరావుగారికి ఆయనపై ఆయనకు ఉన్న నమ్మకానికి నమస్కారం చేయాలనిపించింది'' అన్నారు.


● రామ్‌చరణ్, నమ్రత, మహేశ్ బాబు

జయసుధ మాట్లాడుతూ- ''నాగేశ్వరరావుగారితో ఎక్కువ సినిమాలు చేయడం నా అదృష్టం. క్రమశిక్షణతో పాటు ఆయన దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు.

ఏయన్నార్ కుమార్తె నాగ సుశీల మాట్లాడుతూ- ''అందరికీ పండగలు ఉంటాయి. కానీ మా అక్కినేని అభిమానులకు నాన్నగారి జయంతే పండగ. అభిమానుల ప్రోత్సాహం వల్లే ఈ కార్యక్రమం సాధ్యమైంది. అమ్మానాన్నలు మేం ఎప్పుడూ కలిసే ఉండాలని కోరుకునేవారు. అలా మేమందరం కలిసే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేశాం'' అన్నారు.

సుశాంత్ మాట్లాడుతూ- ''తాతగారు తన జీవితంలో కృతజ్ఞతకు విలువ ఇచ్చేవారు. ఇండస్ట్రీలో తారాస్థాయికి ఎదిగిన ఆయనకు కళామతల్లికి తిరిగి ఇవ్వాలని ఉండేది. అన్నపూర్ణ స్టూడియోస్, అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్, ఏయన్నార్ నేషనల్ అవార్డు, అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా.. ఇలా ఎన్నో ఆయన కృతజ్ఞతలోంచి వచ్చిన ఆలోచనలే'' అన్నారు.

''నాగేశ్వరరావుగారి విగ్రహం పనులను నాకు అప్పగించిన అక్కినేని కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. దాదాపు ఐదున్నర నెలలు వర్క్ చేశాం'' అన్నారు విగ్రహ రూపకర్త వినేష్ విజయన్.

ఈ కార్యక్రమంలో అమల, సుప్రియ, సుమంత్, ఇలా అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్, జగపతిబాబు, శ్రీకాంత్, మంచు విష్ణు, నాని, నాజర్, అనుపమ్ ఖేర్, అల్లు అరవింద్, అశ్వినీదత్, సి. కల్యాణ్, కేఎల్ నారాయణ, 'దిల్' రాజు, చినబాబు, నాగవంశీ, బి. గోపాల్, వైవీఎస్ చౌదరి, పి. కిరణ్, గుణ్ణం గంగరాజు, విజయ చాముండేశ్వరి తదితరులు పాల్గొని, అక్కినేని నాగేశ్వరరావుకి నివాళులు అర్పించారు.